సాక్షి
విజయనగరం
శనివారం, 30, ఆగస్టు, 2025

● భాషా చైతన్యం



పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగును వ్యవహారిక భాషగా మార్చుచేయడంలో గిడుగు రామమూర్తి పంతులు కృషిని కొనియాడారు. మాతృభాష ప్రాధాన్యంను ఉపాధ్యాయులు తెలియజేశారు. తెర్లాం మండలం పెరుమాళి ఉన్నతపాఠశాల విద్యార్థులు తెలుగు అక్షర ఆకారంలో కూర్చొని భాషపై చైతన్యం కల్పించారు. – తెర్లాం

ఇన్‌స్టాగామ్‌లో యువతికి వేధింపులు

● కేసు నమోదు చేసిన పోలీసులు

విజయనగరం క్రైమ్: ఇన్‌స్టాగామ్‌లో ఓ యువకుడు తన కుమార్తెను వేధిస్తున్నాడంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు విజయనగరం వన్ టౌన్ సీఐ ఆర్‌వీకే చౌదరి శుక్రవారం తెలిపారు. ఐటీ యాక్ట్ కింద దర్యాప్తు చేపట్టామని, నగరంలోని కె.ఎల్.పురానికి చెందిన బెవర వేణుపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

న్యూస్‌రీల్

సముద్రాలకు తెలుగు కీర్తి పురస్కారం



తెలుగు కీర్తి పురస్కారాన్ని అందుకుంటున్న సముద్రాల గురుప్రసాద్

విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, సాహితీవేత్త సముద్రాల గురుప్రసాద్‌ను తెలుగు కీర్తి పురస్కారం వరించింది. గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన జాతీయ తెలుగు సాంస్కృతిక వైభవ ఉత్సవంలో హర్యానా రాష్ట్ర పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతులు మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

దళితుల ఐక్యతను దెబ్బతీసే కుట్రను తిప్పికొడదాం

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్

రాజాం సిటీ: దేశవ్యాప్తంగా దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు వర్గీకరణ పేరుతో రాజకీయ కుట్ర జరుగుతోందని, దీనిని తిప్పికొడదామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ రత్నాకర్ పిలుపునిచ్చారు. రాజాంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో వందలో నలుగురికే లబ్ధి చేకూరుతుందని గుర్తుచేశారు. నాలుగు సీట్లను రెండు తెలుగురాష్ట్రాల్లో చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు ఎలా సర్దుబాటు చేస్తారని ప్రశ్నించారు. ఇది దళితుల ఐక్యతపై కుట్రకాదా అని ప్రశ్నించారు. ఇంతటి ఘోరంగా మాలలపై కుట్ర జరుగుతుంటే ఆ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు నోరు మెదపక పోవడం ఘోరమన్నారు. విశ్రాంత తహసీల్దార్ దేబారిక రామప్పుడు, జరజాన నీలయ్య, బోనాపు తవిటయ్య, జి.సూర్యనారాయణ, బి.తిరుపతిరావు, టి.మోహన్, కె.అన్నారావు, కె.ప్రేమ్‌బాబు, కె.కొండబాబు, నెల్లి సూరిబాబు, వై.సత్తిబాబు, టి.నాని పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డివిజన్లలో వయోవృద్ధుల పరిష్కార వేదిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరంఫోర్ట్: వయోవృద్ధులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి వయోవృద్ధుల కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించారు. వయోభారంతో ఉన్న వారికి నివాసం, ఆహారం, దుస్తులు, మందులు సమకూర్చే ఏర్పాట్లు చేయాలని హితవు పలికారు. ఇప్పటివరకు జిల్లాలో వయోవృద్ధుల సమస్యల మీద 23 అర్జీలు వచ్చాయన్నారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం భవనం, ఫిజియోథెరపీ సెంటర్ కొరకు అనువైన ప్రాంతాన్ని గుర్తించి నివేదిక అందజేయాలని డీఆర్వోకు ఆదేశాలు జారీచేశారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, డీఎస్పీ వీరకుమార్ పాల్గొన్నారు.

క్రీడా పురస్కారాలు ప్రదానం



ఉత్తమ పురస్కారాలు దక్కించుకున్న పాఠశాల ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అధికారులు

విజయనగరం: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్కూల్ గేమ్స్ పోటీల్లో ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధించిన పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ శుక్రవారం పురస్కారాలు ప్రదానం చేసింది. గరివిడి మండలం తోండ్రంగి, బాడంగి, బొబ్బిలి మండలం పారది, రామభద్రాపురం మండలం ఆరికతోట, బొబ్బిలి మండలం కారాడ జిల్లా పరిషత్ పరిషత్ ఉన్నత పాఠశాలలకు వరుసగా ఐదు పురస్కారాలను అందజేశారు. డెంకాడ మండలం మోదవలసలో జరిగిన కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు డీఈఓ మాణిక్యంనాయుడు, జిల్లా గేమ్స్‌ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణంరాజు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

ఎరువు అందక.. సాగు సాగక..





బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో వర్షాలు కురిశాయి. వర్షాధార భూముల్లోనూ చివరి కార్తెలో వరి ఉభాలు పూర్తయ్యాయి. చేనుకు ఎరువు రూపంలో సత్తువ అందిద్దామంటే దొరకడం లేదు. రైతన్నలు పొలం పనులు మానుకుని గంటల తరబడి రైతుసేవా కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నా ఎరువు దొరుకుతుందోలేదో తెలియని దుస్థితి. వచ్చిన అరకొర ఎరువును కూటమి నాయకులు గెద్దల్లా తన్నుకుపోతుండడంతో ఉభాలు వేసిన ఉత్సాహం రైతుల్లో సన్నగిల్లుతోంది. అసలే ఆలస్యం.. దీనికి తోడు ఎరువు వేయకపోతే చేను భూమిలోనే ఉండిపోతుందని, దిగుబడిపై ప్రభావం చూపుతుందని, తిండిగింజలు కూడా పండవంటూ రైతులు తల్లడిల్లుతున్నారు. ఎరువు కోసం పరుగులు తీస్తున్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతు రాజ్యాన్ని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతుకు రిక్తహస్త పాలనను గుర్తుచేసుకుంటున్నారు. – సాక్షి ప్రతినిధి, విజయనగరం

● నాటి జగనన్న రాజ్యం.. రైతు ఇంట సౌభాగ్యం ● ఊరూరా ఆర్బీకేలు.. సరిపడా ఎరువుల నిల్వలు
● నేడు రాక్షస రాజ్యం.. దళారులదే భోజ్యం ● యూరియా కోసం అన్నదాత అగచాట్లు

2025లో సరఫరా అయిన యూరియా 11,355 టన్నులు



సీజన్‌కు ముందే రైతులకు ఆర్‌బీకేల యూరియా అందిస్తున్న నాటి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, అధికారులు (ఫైల్)



రాజాంలోని ఓ ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం రైతుల క్యూ (ఫైల్)


● నాడు రైతన్న రాజ్యం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 635 రైతు భరోసా కేంద్రాలు ఉండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 2023 సంవత్సరంలో 32,000 టన్నుల యూరియా సరఫరా చేశారు. రైతు పక్షపాతి అయిన జగన్ పాలన మొదలైంది మొదలు అన్ని వర్గాలూ సంబరపడ్డాయి. రాష్ట్రం యావత్తు పండగ చేసుకుంది. రైతుల కళ్లలో గతంలో ఎన్నడూలేనంతగా కాంతులీనాయి. తమకు కొండంత అండగా ఉండే నాయకుడు ఎదురొస్తే.. మీ కష్టానికి నేను అడ్డుగా నిలబడతానని భరోసా ఇస్తే.. మీ పంటకు గిట్టుబాటు ధర లేదని చింతవలదు.. అన్నిటికీ నేనున్నానని చేదోడు అందిస్తే.. అంతకన్నా ఇంకేం కావాలి. పంట వేసేముందు పెట్టుబడి సాయం.. పంట కోశాక గిట్టుబాటు ధర.. పంట మధ్యలో ఇంటికే ఎరువులు.. ఊరూరా రైతుభరోసా కేంద్రాలు.. ఇలా బజారుకు వెళ్లి అలా మిఠాయిపొట్లం కొనుక్కున్నంత సునాయాసంగా ఎరువులు.. పురుగు మందులు వాస్తవ ధరకు కొనుక్కునే వెసులుబాటు.. అక్కడే ఓ కుర్చీలో కూర్చుని ఏం కావాలి చెప్పన్నా అంటూ అడిగే వ్యవసాయ శాఖ ఉద్యోగి.. పంటకు తెగుళ్లు వస్తే అక్కడికక్కడే పరిశీలించి వాటికి విరుగుడు చెప్పే యువకుడైన వ్యవసాయ శాఖ ఉద్యోగి.. ఏ పంటలు వేయాలో సూచించే ఒక క్యాలెండర్.. పంట వేశాక వాటిని బస్తాల్లో ఎక్కడికో తరలించాల్సిన అవసరం లేకుండా ఊళ్లోనే మంచి ధరకు వాటిని అమ్ముకునే దిలాసా.. ఒక రైతుకు అంతకన్నా కావాల్సిందేముంది. ముఖ్యంగా ఎరువుల విషయంలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిన వ్యవస్థ ఇంకొకటి లేదని రుజువైంది. ఎరువుల కోసం కంగారెందుకురా.. ఇదేం చంద్రబాబు పాలన కాదు.. జగనన్న వచ్చాడు.. మన ఊళ్లోనే ఆ చివరున్న రైతు భరోసా కేంద్రంలో కావాల్సినన్ని ఎరువులున్నాయి తెచ్చుకుందాం. అవేం బ్లాక్ మార్కెట్‌కు వెళ్లిపోవులే.. మన ఊరి భరోసా కేంద్రం.. మనకు అసలైన దిలాసా కేంద్రం. హాయిగా సాయంత్రం అలా వెళ్లి తెచ్చుకుందాం.. అని రైతులు ధీమాగా ఉండేవారు. ఒక తల్లి ఇంటిల్లిపాదికీ సరిపడే భోజనం వండిన మాదిరిగా ఒక ఊళ్లో ఎంతమంది రైతులకు ఎన్ని బస్తాల ఎరువులు కావాలన్నది లెక్కేసి మరి లోడ్లు ఊళ్లోకి వచ్చి నిల్వ చేసేవారు. ఎరువు అయిపోతుందన్న భయం లేదు.. అవును.. తల్లి ఏ బిడ్డ కడుపునూ ఆకలితో ఉంచదు కదా.. అలాగే జగనన్న కాలంలో ఏ రైతు కూడా ఎరువుకోసం కష్టాలు ఏకరువు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది కాదు. తనకు నచ్చినప్పుడు.. అలా వెళ్లి ఓ రెండు బస్తాలు తెచ్చుకుని పొలంలో జల్లుకునే వెసులబాటు. సరుకు దొరుకుతుందో లేదో అని భయంతో అప్పులు చేసి ఎక్కువ ఎరువుతెచ్చుకోవాల్సిన భయం లేదు. ఎందుకంటే అది జగనన్న ప్రభుత్వం మరి.. రైతు కళ్లలో సంతోషం.. కల్లంలో ఆనందం తాండవించేది. రామరాజ్యంలో కూడా ఇలాగే ఉండేదట అని అందరూ చెప్పుకునే రోజులు అవి మరి.

2023లో సరఫరా అయిన యూరియా 32,000 టన్నులు



నాడు పాలకొండ మండలం లుంబూరు రైతు భరోసా కేంద్రానికి పుష్కలంగా చేరిన యూరియా



● నేడు.. దళారులదే భోజ్యం

ప్రస్తుతం ఆర్బీకేలు కాస్త ఆర్‌ఎస్‌కేలు మారాయి. వాటి సంఖ్య గణనీయంగా కుదించగా 2025 ఖరీఫ్ సీజన్లో కేవలం 11,355 టన్నులు మాత్రమే యూరియా వచ్చింది. అది కూడా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందన్నది రైతుల వాదన. అందమైన వసంతం తరువాత మంటెక్కించే గ్రీష్మం వచ్చినట్లు.. తీయని నేతి మిఠాయి తిన్నాక గొడ్డుకారం చప్పరించినట్లు.. చల్లని మంచు కాళ్లను గిలిగింతలు పెడుతున్న దారిలో నడిచిన అనంతరం నిప్పుకణికల్లా మండుతున్న రాళ్ల దారిలో అడుగేస్తున్నట్లు.. శ్రావ్యమైన సంగీతం విన్నాక గార్ధభ గాత్రం మన మనసును పాడు చేసినట్లు.. రైతు పక్షపాతి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన తరువాత సేద్యం అంటేనే అసహ్యించుకునే చంద్రబాబుపాలన మొదలైందన్నది రైతుల మాట. ప్రస్తుతం రైతన్నలను కష్టాలే పలకరించాయి.. కాదు కాదు.. నేరుగా తలుపులు బద్దలుగొట్టుకుని రైతు ఇళ్లలో కష్టాలు తిష్టవేశాయి. ఓ ఏడాది పెట్టుబడి సాయం ఎగ్గొట్టారు.. ఏదోలా అప్పోసప్పో చేసి పంటలు పండిస్తే అవి ఎక్కడ అమ్ముకోవాలో తెలియని దుస్థితి.. నిన్న మొన్నటివరకు ఊరిలో ఠీవీగా నిలబడిన ఆర్బీకేలను కాస్త ఆర్‌ఎస్‌కేలుగా పేరుమార్చి ఉసురు తీసేయడంతో అవి వెలవెలబోతున్నాయి. ధాన్యాన్ని అమ్మితే డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియదు. ఏ పంట వేయాలో చెప్పేవారు లేరు. చేతిలో ఉన్న మరచెంబులోని నీళ్లను లాక్కుని సహారా ఎడారి మధ్యలో వదిలేసినట్లుంది రైతుల పరిస్థితి. చనుబాలకోసం పిల్లాడు గుక్కపట్టి ఏడుస్తున్నా పాలులేవని.. పాలివ్వలేనని.. బిడ్డ ఆకలితీర్చలేనని చెప్పలేని తల్లి పరిస్థితి రైతుకు దాపురించింది. నాట్లు వేసే చివరి కార్తె అయిన పుబ్బ వచ్చేసింది. ఇప్పటికే ఆశ్లేష కార్తెలో వేసిన ఉభాల్లో గాబు తీతలు అయిపోయాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చేను నల్లగా కమ్ముకురావాల్సిన రోజులొచ్చేశాయి. కానీ, పైన చంద్రబాబు ఉన్నాక ఇక చేను ఎలా నవ్వుతుంది.. ఎటు చూసినా యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు దొరికే పరిస్థితి లేదు. వచ్చిన కాసిన్ని బస్తాలు సొసైటీల నుంచి నేరుగా టీడీపీ నేతల గోదాముల్లోకి తరలిపోతున్న దారుణం. కళ్లముందే ఈ దందా జరుగుతున్నా సినిమా చూసినట్లు చూడడం తప్ప ఏమీ చేయలేని అశక్తత. నడిసముద్రంలో మునిగిపోతూ గుక్కెడు నీటికోసం ఆకాశం కోసం చూస్తున్న పరిస్థితి. కడుపులో పట్టెడన్నం పడి మూడ్రోజులైంది.. ఎవరైనా కాసింత గంజి పోస్తే బాగుణ్ణు అనే దుస్థితి. చేనుకు ఎరువు వేయకపోవడంతో ఎదుగుదల లోపించింది. ఎరువుల కోసం చాంతాడంత లైన్లలో గంటలతరబడి నిలబడాల్సి రావడం. తమ కళ్లముందు నుంచి తరలిపోయిన ఎరువులు అంతలోనే బ్లాక్ మార్కెట్లో కనిపించడం.. రెట్టింపు ధరలు పెట్టి కొనుగోలు చేయాల్సి రావడం. ఇదంతా తమ ప్రారబ్ధం అనుకుంటూనే రైతులు పొలం వైపు సాగుతున్నారు. మంచి రోజులు ఎప్పుడొస్తాయా అంటూ ఊపిరిబిగబట్టి పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు.




గరుగుబిల్లి మండలం ఉద్దవోలు రైతుసేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు (ఫైల్)

200 ఎకరాల్లో ఆక్వాసాగు

● కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ప్రస్తుతం 200 ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతోందని, గజపతినగరం, బొండపల్లి మండలాల్లో సుమారు 69 ఎకరాల్లో ఆక్వాసాగుకు జిల్లా స్థాయి కమిటీ అమోదం తెలిపినట్టు కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వెల్లడించారు. ఆక్వాసాగుపై తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 7,900 చెరువులు ఉన్నాయని, సొసైటీలతో సంప్రదించి అధిక విస్తీర్ణంలో ఆక్వాసాగుకు కృషి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో మత్స్యశాఖ డీడీ విజయకృష్ణ పాల్గొన్నారు.

5వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో



ఒక గేటు ద్వారా దిగువకు విడిచిపెడుతున్న నీరు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ శుక్రవారం తెలిపారు. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 4,760 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో చేరుతోందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 64.39 మీటర్ల నీటిమట్టం నమోదైందన్నారు.

డిగ్రీ కళాశాల కోసం భవనాల పరిశీలన



డ్వామా కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

నెల్లిమర్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం నెల్లిమర్ల ఈవీఎం గోదాముల వద్దనున్న పలు ప్రభుత్వ భవనాలను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం పరిశీలించారు. డిగ్రీ కళాశాల యాజమాన్యం విజ్ఞప్తి మేరకు ఇక్కడి పాత డ్వామా కార్యాలయ భవనాన్ని, పక్కనే ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు భవనాన్ని, పరిసర ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి వసతులు, గదులు, రవాణా ఇతర సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఆయన వెంట డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, నెల్లిమర్ల తహసీల్దార్ శ్రీకాంత్, ఇతర అధికారులు, కళాశాల ప్రతినిధులు, సిబ్బంది ఉన్నారు.

జర్మన్ లాంగ్వేజ్ నేర్చుకునేందుకు ఉచిత శిక్షణ

విజయనగరం టౌన్: జర్మనీలో నర్సు ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా జర్మన్ లాంగ్వేజీ నేర్చుకునేందుకు ఎస్సీ, ఎస్టీ మహిళల నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు ఎం.అన్నపూర్ణమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జర్మన్ లాంగ్వేజ్‌లో 8 నుంచి 10 నెలల పాటు శిక్షణ పొందేందుకు నర్సింగ్‌లో డిగ్రీ పట్టా పొందిన ఎస్సీ, ఎస్టీ మహిళలు అర్హులన్నారు. విశాఖపట్నంలో ఉచిత వసతితో కూడిన శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సాంఘిక సంక్షేమశాఖ విజయనగరం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చెట్టుకిందనే ప్రసవం

● ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రసవించిన గిరిజన మహిళ
● సపర్యలు చేసిన పెద్దకుమార్తె
● ఏడో కాన్పులో ఆడబిడ్డ జననం
● ఆస్పత్రికి తరలింపు

బొబ్బిలిరూరల్:

ఓ నిండు గర్భిణి ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. బొబ్బిలి ఆర్టీసీ కాంపెక్స్‌కు ఎదురుగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని ఓ చెట్టుకిందనే ఏడో సంతానంగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఎనిమిదేళ్ల కుమార్తె తల్లికి సపర్యలు చేసింది. వివరాల్లోకి వెళ్తే...

బొబ్బిలి మండలం గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని అక్కేనవలస గిరిజన గ్రామానికి చెందిన దుబ్బాక పార్వతి 9 నెలలు నిండు గర్భిణి. భర్త లక్ష్మణతో కలిసి రామభద్రపురం మండలంలోని రొంపల్లి సమీపంలోని పామాయిల్ తోటలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఒక కుమార్తె చనిపోయింది. శుక్రవారం ఏడో సంతానంలో పార్వతికి పురిటినొప్పులు రావడంతో తన 8 ఏళ్ల వయసున్న పెద్దకుమార్తె శైలజను వెంటపెట్టుకుని ఆటోలో బొబ్బిలి సీహెచ్‌సీలో చేరేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో దిగారు. అప్పటికే పార్వతికి నొప్పులు ఎక్కువ కావడంతో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఓ చెట్టు కిందకు చేరుకున్నారు. శైలజ భయపడకుండా తల్లికి సపర్యలు చేస్తూనే ఉంది. కాళ్లు, చేతులు నిమురుతూ తల్లికి ధైర్యం చెప్పింది. ఇంతలో తల్లి పార్వతి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అక్కడే ఉన్న కొంతమంది పాత్రికేయులు 108కు సమాచారం ఇవ్వడంతో తల్లీబిడ్డను బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ మెరుగైన వైద్యచికిత్స పొందుతున్నారు.



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణ నుంచి తల్లీబిడ్డను 108లో తరలిస్తున్న సిబ్బంది

మొన్న కొత్తబట్టివలస, నేడు అక్కేన వలస...

బొబ్బిలి నుంచి పార్వతీపురం రాష్ట్రీయ రహదారి వైపు ఉన్న దాదాపు 10 పంచాయతీలకు వైద్య సేవలు అందుబాటులో లేవు. ఈ పంచాయతీల్లో ఎవరికీ వైద్యసహాయం కావాలన్నా 25 కిలోమీటర్ల దూరంలోని పిరిడి పీహెచ్‌సీకి వెళ్లాలి. అంతదూరం వెళ్లేందుకు ఇష్టపడని గిరిజనులు గ్రామాల్లోనే ఉంటూ సుఖప్రసవం కోసం ప్రయత్నించి చివరి నిమిషాల్లో వైద్యసహాయాన్ని పొందుతున్నారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు లేని గిరిజన గ్రామాల్లో డోలీలే దిక్కవుతుండగా, ప్రమాదకర పరిస్థితుల్లో ఇలాంటి ప్రసవాలు చోటుచేసుకుంటున్నాయి. పదిరోజుల కిందట కొత్త బట్టివలస గ్రామానికి చెందిన నిండు గర్భిణిని 5 కిలోమీటర్లు డోలీలో మోసుకుని పిరిడి పీహెచ్‌సీకి తరలించగా, నేడు ఆ పక్కనే ఉన్న అక్కేనవలస గిరిజన గ్రామం మహిళ ఆస్పత్రికి వస్తూ చెట్టుకిందనే బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అత్యవసర వైద్యసహాయం కోసం గిరిజన పంచాయతీలకు చేరువలో పీహెచ్‌సీని ఏర్పాటుచేయాలని గిరిజన నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్వతి, బిడ్డ

పలు రైళ్ల రద్దు

విజయనగరం టౌన్: విజయనగరం రైల్వేస్టేషన్ నుంచి శుక్రవారం ఉదయం బయలు దేరిన గూడ్స్‌రైలు సంతకాల బ్రిడ్జి సమీపంలో పట్టాలు తప్పడంతో ట్రాక్ పూర్తిగా దెబ్బతింది. దీంతో పలు రైళ్లను రద్దుచేస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రకటన జారీచేసింది. కొన్ని రైళ్లు నాలుగైదు గంటలు ఆలస్యంగా నడిచాయి.

29, 30వ తేదీల్లో రద్దయిన రైళ్ల వివరాలిలా...

విజయనగరం–విశాఖపట్టణం ప్యాసింజర్ (67288), విశాఖ–పలాస ప్యాసింజర్ (67289), పలాస–విశాఖ ప్యాసింజర్ (67290), విశాఖ–బరంపురం ప్యాసింజర్ (58532), విశాఖ– విజయనగరం(67287), విశాఖ–కోరాపుట్ ప్యాసింజర్(58538), విశాఖ–దుర్గ్ ఎక్స్‌ప్రెస్(18530), బరంపురం–విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్(18525), విశాఖ–దుర్గ్ వందే భారత్(22820), 30వ తేదీన కోరాపుట్–విశాఖ (58537), బరంపురం–విశాఖ ప్యాసింజర్ (58531)లను రద్దు చేశారు.

● పాక్షికంగా రద్దు చేసిన రైళ్లలో రైలు నంబర్ 58531 బరంపురం– విశాఖ, 58503 /58504 భవానీపట్నం–విశాఖ, 20841 భువనేశ్వర్–విశాఖ వందే భారత్, 20842 విశాఖ–భువనేశ్వర్ వందేభారత్, 20829 దుర్గ్–విశాఖ వందేభారత్, 20830 విశాఖ–దుర్గ్ వందేభారత్, 20830 విశాఖ–దుర్గ్ వందేభారత్, 58527 రాయపూర్–విశాఖప్యాసింజర్, 22819 భువనేశ్వర్ న్యూ–విశాఖ ఇంటర్ సిటీలను పాక్షికంగా రద్దుచేశారు. వీటితో పాటూ 11020 భువనేశ్వర్ న్యూ–సీఎస్ఎంటీ ముంబై కోనార్క్ ఎక్స్‌ప్రెస్, 22883 పూరీ–యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్‌లు నాలుగు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయని రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

జామి: గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్లను జామి మండలం అలమండ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. పూరి–బిలాస్‌పూర్ రైలు నిలిపివేయడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. విజయనగరం, పార్వతీపురం వెళ్లేవారు బస్సులు, ఆటోల కోసం పడిగాపులు కాశారు.



అలమండ కూడలిలో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

క్లుప్తంగా

ఆధునిక పరిశోధనలకు గిరిజన జ్ఞానం దోహదం

• గిరిజన యూనివర్సిటీలో పద్మశ్రీ చెరువాయల్ రామన్

విజయనగరం అర్బన్: గిరిజన జ్ఞాన సంపదను ఆధునిక పరిశోధనలతో అనుసంధానం చేయడం సమగ్ర సమాజ నిర్మాణానికి కీలకమని పద్మశ్రీ చెరువాయల్ రామన్ అన్నారు. స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని 'గిరిజన జ్ఞాన వ్యవస్థ : సర్దుబాటు మరియు సమగ్రత' అనే అంశంపై శుక్రవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు సంప్రదాయ వ్యవసాయం, మూలికా వైద్యం, ప్రకృతి వైద్య విధానాలు శాస్త్రీయంగా అభివృద్ధి చెందితే సమాజానికి మరింత మేలు చేస్తాయని సూచించారు. అనంతరం ఆయన్ని యూనివర్సిటీ ఘనంగా సత్కరించింది. విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, డాక్టర్ సీత కక్కోత్, ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, డాక్టర్ నగేష్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమణ, పక్కన ఎస్‌ఐ

బొండపల్లి: మండలంలోని కనిమెరక గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో బ్యాగ్‌లతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని సోదా చేయగా వారి బ్యాగ్‌ల్లో మూడు కేజీల ఆరు వందల గ్రాముల గంజాయి గుర్తించినట్టు గజపతినగరం సీఐ రమణ శుక్రవారం తెలిపారు. రాయగడ నుంచి బ్యాగ్‌ల్లో కొత్తపాలెం గ్రామానికి చెందిన బండారు రాము, పద్మనాభ మండలం బొత్సపేటకు చెందిన గణేష్, మరో నిందితుడు జునేయల్ బ్యాగ్‌ల్లో కేజీ 200గ్రాములు చొప్పున మూడు కేజీల ఆరు వందల గ్రాములు గంజాయిని తీసుకువచ్చి గ్రామాలలో వినాయక నిమజ్జనాల సందర్భంగా యువకులకు సరఫరా చేయడానికి తీసుకువస్తున్నట్టు సమాచారం అందిందని చెప్పారు. అందిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ యు.మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గిడుగు సేవలు మరువలేనివి



తెలుగు వేషధారణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నెల్లిమర్ల: గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలు మరువలేనివని డైట్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య శిక్షణా సంస్థ (డైట్)లో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ నేత గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రామకృష్ణారావు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలు మరువలేనివన్నారు. ముఖ్యంగా ఆయన ఉత్తరాంధ్ర వాడుక భాషనే కాకుండా వ్యవహారిక భాష ఉద్యమం చేపట్టి పల్లె ప్రజలు, నిరక్షరాస్యులకు అర్థమయ్యేలా పాలకుల్లో మార్పు తీసుకు వచ్చిన ఘనత గిడుగుకి దక్కుతుందని, సవర భాషకు లిపిని తయారు చేసి మన్యం గిరిజనుల బతుకుల్లో వెలుగు నింపారని గుర్తు చేశారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవంపై మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నామని ధ్యాన్‌చంద్ హాకీలో ఒలింపిక్ పోటీల్లో బంగారు పతకం సాధించి దేశానికి పేరు తీసుకు వచ్చారని గుర్తు చేశారు. భువన విజయం, కన్యాశుల్కం ప్రదర్శించారు. కార్యక్రమంలో తెలుగు విభాగం ఉపన్యాసకులు కంచుపల్లి అప్పారావు, పతివాడ సూర్యారావు, కాళ్ల అప్పారావు, స్టాఫ్ సెక్రటరీ వి.చిన్నం నాయుడు, సూపరింటెండెంట్ కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రిలో రోగుల కష్టాలు..!

• రాత్రి వేళ మరింత కష్టాలు
• స్పెషాల్టీ వైద్యులు అందుబాటులో ఉండని వైనం
• అధిక శాతం వైద్యులు విశాఖ నుంచి రాకపోకలు
• రిఫరల్స్ ఎక్కువగా చేస్తున్నారనే ఆరోపణలు

☛ బొండపల్లి మండలానికి చెందిన కృష్ణ అనే వ్యక్తికి కడుపు నొప్పి రావడంతో వారి బంధువులు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తెల్లవారు జామున 5 గంటల సమయంలో తీసుకువెళ్లారు. సంబంధిత స్పెషాల్టీ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో క్యాజువాలటీ వైద్యులే సేవలు అందించారు. అల్ట్రాసౌండ్ స్కాన్ అత్యవసరం అయినప్పటికీ ఉదయం 10 గంటల వరకు నొప్పితోనే నిరీక్షించాల్సిన పరిస్థితి.



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సకాలంలో రోగులకు వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇక్కడ వైద్య సేవలు అందించేగలిగే వాటిని కూడా వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ చాలా వైద్య సేవలు గగనంగా మారాయనే అపవాదు ఉంది.

విశాఖ నుంచి రాక పోకలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యులంతా స్థానికంగా ఉండాలి. కానీ అధిక శాతం మంది వైద్యులు విశాఖపట్నం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం అందరూ స్థానికంగా ఉండాలి. ఎందుకంటే వీరు హోమ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) తీసుకుంటున్నారు. అయితే ఇక్కడ ఉండకపోయినప్పటికీ తప్పడు అడ్రస్‌లు చూపించి హెచ్‌ఆర్‌ఏ పొందుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా స్పెషాల్టీ వైద్యులు అవసరం ఎంతో ఉంటుంది. రోగులు ప్రాణాలు కాపాడడంలో వీరిదే ప్రధాన పాత్ర. వీరు అందుబాటులో ఉంటే రోగులకు సకాలంలో వైద్యం అందించడానికి వీలుంటుంది.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

రాత్రి సమయంలో అందుబాటులో ఉండని స్పెషాల్టీ వైద్యులు

రాత్రి పూట స్పెషాల్టీ వైద్యులు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంబీబీఎస్ వైద్యులు, పీజీ వైద్యులే రోగులకు పెద్దదిక్కుగా నిలుస్తున్నారు. వాస్తవంగా స్పెషాల్టీ వైద్యులు రాత్రి వేల ఆసుపత్రిలో ఉండాలి. కానీ గత కొంత కాలంగా స్పెషాల్టీ వైద్యులు ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రిఫరల్స్ ఎక్కువగా చేస్తున్నారనే ఆరోపణలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యం అందించే గలిగే పరిస్థితి ఉన్నప్పటికీ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎక్కువగా రిఫరల్స్ చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. స్పెషాల్టీ వైద్యులు రాత్రి సమయంలో అందుబాటులో లేకపోవడం వల్ల తమకెందుకు వచ్చిన రిస్క్ అనుకుని రిఫర్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతీ రోజు ఇక్కడి ఆసుపత్రి నుంచి మూడు నుంచి నాలుగు రిఫరల్స్ చేస్తున్నట్టు తెలుస్తుంది.

సాయంత్రం 4 గంటల తరువాత అందని అల్ట్రా సౌండ్ సేవలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సాయంత్రం 4 గంటల తర్వాత అల్ట్రాసౌండ్ స్కాన్ సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి పూట తీవ్రమైన కడుపునొప్పి, కడుపులో తీవ్రమైన మంటతో వచ్చే వారికి అత్యవసరంగా అల్ట్రా సౌండ్ చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలో వైద్యులు అందుబాటులో లేక పోవడం వల్ల మరుసటి రోజు ఉదయం 9, 10 గంటలకు వైద్యులు వచ్చే వరకు నొప్పితోనే రోగులు నిరీక్షించాల్సిన పరిస్థితి.

1200 వరకు ఓపీ

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఓపీకి 1000 నుంచి 1200 మంది వరకు రోగులు వస్తున్నారు. అదే విధంగా 60 నుంచి 80 మంది వరకు ఇన్‌పేషంట్లుగా రోగులు చేరుతున్నారు.

రిఫర్ చేస్తే చర్యలు తీసుకుంటాం..

ఆసుపత్రిలో చికిత్స చేయగలిగే రోగులకు ఇక్కడే సేవలు అందిస్తారు. చికిత్స అందివ్వగలిగే వారిని రిఫర్ చేస్తే చర్యలు తీసుకుంటాం. రాత్రి సమయంలో జనరల్ మెడిసిన్, జనరల్ ఫిజీషియన్ విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చాం. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటాం. అల్ట్రా సౌండ్ స్కాన్ అత్యవసరం అనుకుంటే వైద్యులు వచ్చి స్కాన్ చేయాలి. ఆ విధంగా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సంబంగి అప్పలనాయుడు,
సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

ఇక ఆన్‌లైన్‌లో రిమాండ్ ఖైదీల విచారణ

• జైళ్ల అధికారి మధుబాబు



మాట్లాడుతున్న జిల్లా జైళ్ల అధికారి మధుబాబు

బొబ్బిలి: రిమాండ్‌లో ఉన్న ఖైదీలను జైలు నుంచి కోర్టులకు తరలించే సమయంలో భద్రత, సమయం, తరలింపు తదితర అంశాలను మరింత మెరుగు పర్చుకునే క్రమంలో కొన్ని మార్పులు చేసినట్టు జిల్లా జైళ్ల అధికారి జి.మధుబాబు తెలిపారు. స్థానిక సబ్ జైలును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రిమాండ్ ఖైదీల విచారణ సమయంలో కోర్టులకు తరలించే వ్యయ, ప్రయాసలను తగ్గించేందుకు, మరింత సులువుగా మెరుగైన ప్రక్రియ నేపథ్యంలో ఆన్‌లైన్‌లోనే వారి కేసులను విచారించేందుకు ఉన్నత న్యాయమూర్తుల ఆదేశాల మేరకు జైళ్లలో తగు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, ఎస్.కోట, చీపురుపల్లి సబ్ జైళ్లలో 150 మంది వరకూ వివిధ కేసులకు సంబంధించి రిమాండ్ ఖైదీలున్నారన్నారు. ఇవి నడుస్తున్న భవనాలు బ్రిటిష్ కాలం నాటివి కావడంతో కొత్త భవనాల నిర్మాణం కోసం అవసరమైన స్థలాల గుర్తింపునకు రెవెన్యూ అధికారులకు ప్రతిపాదించినట్టు చెప్పారు. జిల్లా జైలు కోసం సారిక వద్ద ఏడెకరాలను, బొబ్బిలి సబ్ జైలు కోసం గ్రోత్‌సెంటర్ వద్ద ఐదెకరాలను గుర్తించామన్నారు. మిగతా సబ్‌జైళ్ల స్థలాలు కూడా గుర్తిస్తే భవన నిర్మాణాలకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. సబ్ జైలర్ పాత్రో, సిబ్బంది ఉన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని యువకుడి మృతి



రైలు ఢీకొని మృతి చెందిన యువకుడు శంకరావు

బొండపల్లి: మండలంలోని కనిమెరక రైల్వే గేటుకు సమీపంలో రైల్వేట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి బొబ్బిలి రైల్వే హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలంలోని వింద్యావాసి గ్రామానికి చెందిన టి.శంకరరావు (26) రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొనడంతో మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పాముకాటుతో మహిళ..



మృతురాలు కొత్తమ్మ

గంట్యాడ: పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దిగువ కొండపర్తి గ్రామానికి చెందిన ఎర్రబోయిన కొత్తమ్మ (40) తాను నివసిస్తున్న పూరి గుడిసెలో గుర్తు తెలియని పాము కాటు వేయడంతో మరణించింది. దీనిపై ఫిర్యాదు అందడంతో గంట్యాడ పోలీసులు మృతదేహాన్ని ఎస్.కోట ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. మృతురాలికి 16 ఏళ్ల వయసు గల కుమార్తె ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆఫ్‌లైన్ పద్ధతిలో ముగిసిన బార్ లాటరీ ప్రక్రియ

విజయనగరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బార్ పాలసీ 2025-28లో దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం సాయంత్రం 5 గంటలతో ఆఫ్‌లైన్ పద్ధతి ముగిసిందని, 30న ఓపెన్ కేటగిరి, గీత కులాలు సంబంధించిన బార్లు లాటరీ పద్ధతిలో కలెక్టర్ సమక్షంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంపిక నిర్వహిస్తామని జిల్లా మద్యనిషేధ, అబ్కారి శాఖ అధికారి బి.శ్రీనాథుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఓపెన్ క్యాటగిరి బార్లు 51 దరఖాస్తులు, గీత కులాలు మూడుబార్లు 21 దరఖాస్తులు, పార్వతీపురం మన్యం జిల్లాలో ఓపెన్ క్యాటగిరి బార్ తొమ్మిది దరఖాస్తులు, గీతకులాల బార్ పది అప్లికేషన్‌లు స్వీకరించామన్నారు. ఒక బారుకు నాలుగు కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన విజయనగరంలో 14 బార్లు, పార్వతీపురం జిల్లాలో నాలుగు బార్లుకు లాటరీ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

లభ్యం కాని మత్స్యకారుడి ఆచూకీ

పాచిపెంట: చేపల వేటకు ఈ నెల 27న వెళ్లి పెద్దగెడ్డ జలాశయంలో గల్లంతైన మండలంలోని కోడికాళ్లవలస గ్రామానికి చెందిన గిరిజన మత్స్యకారుడు జన్ని బాలరాజు ఆచూకీ శుక్రవారం కూడా లభ్యం కాలేదు. ఎస్‌ఐ వెంకటసురేష్ నేతృత్వంలో పెద్దగెడ్డ జలాశయంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి పడవుల్లో శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టారు. బాలరాజు ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం కూడా గాలింపు చేపడతామని ఎస్‌ఐ తెలిపారు.

మూడు రెట్లు పెరిగిన గంజాయి కేసులు

• గంజాయి రవాణాపై గట్టి నిఘా
• ఎస్పీ వకుల్ జిందల్

బొబ్బిలి: జిల్లాలో గంజాయి రవాణా నిరోధించేందుకు గట్టి నిఘా ఉంచామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన శుక్రవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ఏడాదితో పోలిస్తే గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులు మూడు రెట్లు పెరిగాయన్నారు. అలాగే అరెస్టులు నాలుగు రెట్లు పెరిగాయన్నారు. ఇప్పటికే అరెస్టయిన వారి నుంచి రూ.కోట్ల విలువైన ఆస్తులను ఫ్రీజ్ చేశామన్నారు. గంజాయి రవాణా చేసిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు ఆన్‌లైన్ లోన్ యాప్‌లను ఓపెన్ చేయొద్దన్నారు. యాప్‌లలో రుణం తీసుకుంటే అసలు కన్నా అధిక రెట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో మీకు లక్షలాది రూపాయల లాటరీ వచ్చిందని, మీరు రూ.కొంత సొమ్ము కడితే మిగతా సొమ్ముతో పాటు చెల్లిస్తామని చెప్పి పత్తా లేకుండా పోతారన్నారు. దీని వలన ప్రజలు ఆర్థికంగా నష్టపోతారన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని కంప్యూటర్ విభాగాన్ని, సీసీ కెమెరాల కంట్రోల్ విభాగాన్ని పరిశీలించారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ బైక్‌లను పరిశీలించారు. వాటి వివరాలను డీఎస్పీ జి భవ్యారెడ్డి, సీఐలు కె.సతీష్ కుమార్, నారాయణరావులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్లో గౌరవ వందనం స్వీకరించారు. ఎస్‌ఐలు ఆర్.రమేష్‌కుమార్, పి.జ్ఞానప్రసాద్, ఏఎస్‌ఐ డి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ, సీఐలు



సీతంపేట: రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

దోనుబాయి పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ

సీతంపేట: దోనుబాయి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ మాధవరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణను, రికార్డులు పరిశీలించారు. సైబర్ క్రైం, రహదారి ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గణేష్ చతుర్థిని పురస్కరించుకుని ఊరేగింపుల్లో ఎటువంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. కాగా దోనుబాయి ప్రాంతంలో ఒక ఆర్‌ఎంపీ డాక్టర్ పలు అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ, ఆయనపై చర్యలు తీసుకోకపోతే నూతన నక్సలిజం పార్టీ త్వరలో జనంలోకి వస్తాదంటూ స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు దోనుబాయి యూత్ పేరిట ఓ లేఖ సోషల్ మీడియాలో శుక్రవారం హల్‌చల్ చేసింది. దీనిపై ఎస్పీ ఆరా తీసినట్టు తెలిసింది. తహసీల్దార్ శ్రీకన్య వద్ద ఈ విషయమై ప్రస్తావించగా దీనిపై ఆర్‌ఐను విచారణకు నియమించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్‌మస్తాన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులు కాకుండా కొత్త గ్రామాల్లో సర్వే చేసి కొత్త రైతులను గుర్తించి వచ్చే రబీ నుంచి సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. మండల స్థాయిలో 3 రోజులు పాటు సమావేశాలు ఏర్పాటు చేయాలని, తదుపరి గ్రామ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో పాటు, మండల స్థాయి ప్రత్యేకాధికారులను డ్వాక్రా మహిళలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. ర్యాలీలు నిర్వహించాలని, ఎగ్జిబిషన్ ప్రదర్శనలను నిర్వహించి ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలన్నారు. రైతుల నుంచి సలహాలు, సూచనలను కూడా తీసుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని వీటిన్నటిని నమోదు చేసి డాక్యుమెంటరీని తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం సాగుకు ముందుకు వచ్చిన వారి జాబితాను తీసుకుని అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రుపొందించాలని అన్నారు. జిల్లాలో గుర్తించిన 290 క్లస్టర్‌లో బేసిక్ సర్వే ప్రారంభించాలన్నారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, జిల్లా వ్యవసాయ అధికారి తారాకరామారావు, డీపీఎం ఆనందరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, మత్స్య శాఖ డి.డి విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అప్పీల్ చేసుకున్న వారికి పింఛన్

• కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: 40 శాతం పైగా అంగ వైకల్యం ఉన్న వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందని తదనుగుణంగా ఆన్‌లైన్‌లో అప్పీల్ చేసుకున్న వారికి పింఛన్ పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అపీల్‌ను విధిగా అధికారులు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గ్రామాల్లో స్పష్టమైన అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

కౌశలంలో అప్‌లోడ్ చేయాలి

నిరుద్యోగ యువతీ యువకులు వివరాలను కౌశలం పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ధ్రువీకరణ పత్రాలు ఈ మెయిల్, మొబైల్ వివరాలను నమోదు చేయాలని ఆయన తెలిపారు. నమోదు చేసిన అభ్యర్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, డీఎంహెచ్‌వో డా. ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ డా.నాగభూషణరావు, ఎస్‌డీసీ దిలీప్ చక్రవర్తి పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు పక్కదోవ పట్టిస్తే చర్యలు

• స్త్రీనిధి జిల్లా ఏజీఎం కామరాజు
• సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం కామరాజు



ఈ నెల 27న సాక్షిలో వచ్చిన కథనం

వీరఘట్టం: గ్రామ సంఘాల నుంచి రికవరీ చేస్తున్న స్త్రీ నిధి రుణాలను పక్కదోవ పట్టిస్తున్నారని ఈ నెల 27న సాక్షిలో ప్రచురితమైన 'వెలుగులో చీకటి కోణం' కథనంపై వెలుగు జిల్లా యంత్రాంగం స్పందించింది. స్త్రీనిధి జిల్లా ఏజీఎం పి.కామరాజు వీరఘట్టం వెలుగు కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. స్త్రీనిధి రుణాల తీసుకున్న గ్రూపుల వివరాలు, వారు ఎంతెంత కట్టారో తదితర వివరాలు పరిశీలించారు. స్త్రీనిధి రుణాలను సొంత అవసరాలకు వాడుకున్న రేగులపాడు వీవోఏ నుంచి రూ.60 వేలు రికవరీ చేశామన్నారు. మిగిలిన సొమ్ము రెండు రోజుల్లో చెల్లించాలని ఆమెకు సూచించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాలు పక్కదోవ పట్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని డ్వాక్రా గ్రూపులకు రూ.86 కోట్లు స్త్రీ నిధి ద్వారా రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా చేసుకున్నామని, ఇంత వరకు రూ.21 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొండి బకాయిలు ఉన్న 21 గ్రామ సంఘాలు ఉన్నాయని, వీరి నుంచి రూ.48 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఆయనతో పాటు స్త్రీనిధి మేనేజర్ బి.ప్రసన్నకుమార్, ఏపీఎం కె.రాము ఉన్నారు.

నిందితుడి భార్య ఆత్మహత్యా యత్నం



జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హేమలత

పార్వతీపురం రూరల్/మక్కువ: తన తల్లిపై దాడి చేసేందుకు వచ్చే క్రమంలో నిందితుడు ఆదినారాయణ పదునైన ఆయుధంతో పొడవడంతో ప్రాణాలు పోగొట్టుకున్న మృతుడు సాగరాపు కార్తీక్ ఘటన పాఠకులకు విదితమే. అయితే ఈ క్రమంలో శుక్రవారం ఈ కేసు దర్యాప్తు నిమిత్తం మక్కువ పోలీసులు నిందితుని ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న క్రమంలో మృతుని తల్లి దమయంతి నిందితుడి భార్య హేమలత వైపు కోపంగా చూసిన కారణంతో భయాందోళన చెంది ఇంట్లో వున్న జొన్నచేళ్లకు ఉపయోగించే పురుగుల మందును తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్టు ఈ మేరకు వివరాలు సేకరించినట్టు జిల్లా కేంద్ర ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలుశిక్ష

విజయనగరం క్రైమ్ : స్థానిక మహిళా పోలీసుస్టేషన్‌లో 2024లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి పోక్సో ప్రత్యేక కోర్టు 20 సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. దీనికి సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తెలిపిన వివరాలు.. విజయనగరం హుకుంపేటకు చెందిన పెంకి వివేక్(25)కు 14 ఏళ్ల బాలిక నగరంలోని అంబటిసత్రం వద్ద ఓ చర్చికి వెళ్లే సమయంలో పరిచయమైంది. సదరు బాలిక ఆరోగ్యం తరచూ బాగుండకపోవడంతో వివేక్ వారింటికి వెళ్లి సహాయపడేవాడు. ఈ క్రమంలో బాలిక కుటుంబ సభ్యులు వివేక్‌ను పూర్తిగా నమ్మడంతో పాపను కొద్ది రోజులు ఒంటరిగా ఉంచితే ఆరోగ్యం కుదుటపడుతుందని నమ్మించాడు. పక్కా పథకం ప్రకారం బాలికను అంబటివలసలో ఒక ఇల్లు తీసి అక్కడ బాలికను ఉంచి ఆమె ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు వివేక్ అందరిని నమ్మించాడు. బాలికను లోబర్చుకొని శారీరకంగా అనుభవించి కొన్ని వీడియోలు, ఫొటోలు తీసి భయపెట్టసాగాడు. విషయం కాస్త బాలిక తల్లికి తెలిసి విజయనగరం మహిళా పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ ఎస్.పద్మావతి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని ఎస్పీ తెలిపారు. అప్పటి మహిళా పీఎస్ ఇన్‌చార్జి డీఎస్పీ డి.విశ్వనాథ్ దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి అభియోగ పత్రం దాఖలు చేశారని పేర్కొన్నారు. కేసు నమోదైన ఏడాదిన్నరలోనే ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా ప్రస్తుత డీఎస్పీ ఆర్.గోవిందరావు చర్యలు చేపట్టారని తెలిపారు. కోర్టులో నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగారం, రూ.4వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో బాధితురాలికి పరిహారంగా రూ.5లక్షలు మంజూరు చేస్తూ న్యాయమూర్తి తీర్పును వెల్లడించారన్నారు. నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసుల తరఫున పోక్సో కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్ట ఖజానారావు వాదనలు వినిపించారు. డీఎస్పీ ఆర్.గోవిందరావు పర్యవేక్షణలో సీఎంఎస్ హెచ్‌సీ సీహెచ్ రామకృష్ణ, మహిళా పీఎస్ హెచ్‌సీ కె.అప్పలనాయుడు, కానిస్టేబుల్ సూరపునాయుడు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచారని తెలిపారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹236